www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023

ఎసిఎ సిఇఒ ఎం.వి.శివారెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప

కేంబ్రిడ్జ్ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, యుకెకి అనుబంధంగా ఉన్న సెయింట్ మదర్ థెరిస్సా యూనివర్శిటీ ద్వారా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) సిఇఒ ఎం.వి.శివారెడ్డికి క్రీడల్లో గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎం.వి. శివారెడ్డి మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. డాక్టర్ కావాలనే చిన్ననాటి కల పరోక్షంగా ఇలా నెరవేరిందని అన్నారు. జెబిఆర్ హార్వర్డ్ యుఎస్ఎ ద్వారా గుర్తింపు పొందింది అన్నారు. స్నేహితులు, బంధువులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, సోదరులందరూ ఎల్లప్పుడూ తన విజయాన్ని కాంక్షిస్తున్నందున గౌరవం దక్కిందని తెలిపారు.

'ఉక్కు' పనులు వేగవంతం చేస్తాం

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

పులివెందుల దేశానికే ఆదర్శం

గండికోటలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

హాకీ ఆడుతున్న సిఎం జగన్

విల్లు ఎక్కుపెట్టిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

జమ్మలమడుగు : ఒబెరాయ్ హోటల్ నిర్మాణ భూమిపూజలో సిఎం జగన్

పులివెందుల్లో మున్సిపల్ కార్యాలయ భవాన్ని ప్రారంభిస్తున్న జగన్

ప్రజాశక్తి-జమ్మలమడుగురూరల్/పులివెందుల టౌన్/రూరల్

ఉక్కు పరిశ్రమ పనులను మరింత వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం జమ్మలమడుగు పులివెందుల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జమ్మలమడుగు మండలంలోని గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సిఎం ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్‌సింగ్ ఒబెరాయ్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం గండికోటతో పాటు తిరుపతి, విశాఖపట్నం జిల్లా భీమిలీ మండలం అన్నవరంలో కూడా ఒబెరాయ్ గ్రూపు నిర్మించే 7 స్టార్ సౌకర్యాలు గల లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జిందాల్‌తో ఈ ఏడాదిలోనే ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు ఈ నెల 15 తర్వాత ఉక్కు పరిశ్రమకు పర్యావరణ అనుమలు రానున్నాయన్నారు. ఆ తర్వాత పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. ఉక్కు పరిశ్రమ, ఒబెరాయ్ వంటివి జిల్లా రావడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. గండికోటలో ఒబెరాయ్ ఇలాంటి రిసార్ట్స్‌తో పాటు మరో రిసార్ట్స్ కోసం పరిశీలన చేస్తున్నామని తెలిపారు. త్వరలో గండికోటలో మరో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కడప నగర సమీపంపలోని కొప్పర్తిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అక్కడ కూడా మరో రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం దక్కుతుందన్నారు. ఉద్యోగాల విషయంలో స్థానికులు ఇబ్బంది పడవద్దని కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు తొలగిపోతాయని సభాముఖంగా తన ప్రతినిధులకు తెలిపారు. కడప జిల్లాకు ఇంకా మంచి చేయాల్సిన అవసరం, మంచి జరిగే రోజులు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మెరుగ్గా చేసే పరిస్థితులు, అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పారిశ్రామిక వేత్తలకు మనం ఎంత సహకారం అందిస్తే జిల్లా ప్రతిష్ట పెరిగుతుందన్నారు. ఎక్కువ పరిశ్రమలు జిల్లాకు వచ్చి పారిశ్రామిక వేత్తలు పెట్టుబడి పెడతారని తెలిపారు. ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, టూరిజం డెవల్మెంట్ కార్పొరేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రసంగించారు.

కౌన్సిలర్లతో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎపిటిడిసి చైర్మన్ వరప్రసాద్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కలెక్టర్ వి.విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, ఒబెరాయ్ గ్రూప్ పిసిఒ ప్రెసిడెంట్ శంకర్, కడప మేయర్ సురేష్ బాబు, గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, వివిధ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

రూ.142.37 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణాన్ని దేశానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.3.25 కోట్లతో నిర్మించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ప్రారంభించారు. రూ.16.18 కోట్లతో అభివృద్ధి చేసిన పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణి తోపు), రూ.39.00 కోట్లతో అభివృద్ధి చేసిన గరండాల రివర్ ఫ్రెంట్ (పేస్-1) గార్డెన్, రూ.32.82 కోట్లతో అధునాతన వసతులతో 8 ఎకరాల్లో నిర్మించిన వైఎస్ఆర్ ఐఎస్‌టిఎ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీకి, రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన టెక్ బయో సైన్సెస్‌ను, రూ.26.12 కోట్లతో 12.86 ఎకరాల్లో 12 రకాల క్రీడాంశాలకు సంబంధించిన వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీని సిఎం ప్రారంభించారు. జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, సిఎం వ్యక్తిగత కార్యదర్శి దనుంజయరెడ్డి, ఒఎస్‌డి కృష్ణమోహన్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయకుమార్, నూ టేక్ ఎండి ప్రతాప్‌రెడ్డి, ఏపీ కార్ల్ సీఈవో రమణా రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్ సలాం

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా లోని గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్ సలాం పేర్కొన్నారు. ఃజిల్లాలో గిరిజన సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం ఎలా అందిస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాల్లో హాస్టలలో వార్డెన్లు, విద్యార్థుల వివరాలు తెలపండి ?

అన్నమయ్య జిల్లాల్లో 12 గిరిజన గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో ఒక ఆశ్రమ, 5 బాలికలు,6 బాలురు పాఠశాలలున్నాయి. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1799 మంది విద్యార్థులున్నారు. అందులో బాలికలు 845 మంది, బాలురు 954 మంది ఉన్నారు. 12 హాస్టళ్లు ఉన్నాయి. నలుగురు రెగ్యులర్ వార్డెన్లు విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్ డబ్బులు అందుతున్నాయా?

జిల్లాలోని హాస్టళ్ల గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు ప్రతినెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాం. విద్యార్థులకు 2018 - 19 సంవత్సరంలో ఉన్న ఛార్జులు ప్రస్తుతం అమలు అవుతున్నాయి.

హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ అమలలో ఉందా ?

హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నాం. దీని వల్ల ఏ అధికారీ విధులకు హాజరు కాకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి వెళుతుంది. దీనిపై సంజాయిస్తూ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధా నంతో సిబ్బంది పూర్తిగా విధులకు హాజరవుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ఇతర కిట్లు అందుతున్నాయా?

విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, నోటి పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, ఇతర వస్తువులను కూడా ప్రతి విద్యార్థికి పూర్తి శాతంలో అందజేస్తున్నాం.

వంట మనసులు ఎంతమంది ఉన్నారు? ఖాళీలు ఏమైనా ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా వంట మనుషుల పోస్టులు ఆరు మంజూరయ్యాయి. అందులో ప్రస్తుతం నలుగురు విధుల్లో ఉన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి .

అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా? ఖాళీలు ఏమైనా ఉన్నాయి?

జిల్లాలోని సుండుపల్లె బాలురు2, రాయచోటి బాలురు 2, తంబళ్లపల్లె బాలురు 2, కె.వి పల్లె బాలికల 2, రాయచోటి బాలికల 5, రైల్వేకోడూరు మినీ గురుకులం బాలికల 3 ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి .

హాస్టళ్ల అభివృద్ధికి ఎలాంటి చర్య తీసుకుంటున్నారు?

జిల్లాలోని హాస్టళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా అద్దె భవనాలలో ఉన్న వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నాడు- నేడు కింద శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని హాస్టళ్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. త్వరలో అన్నింటిని పూర్తి చేస్తాం

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

రాయచోటి: జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

విద్యుత్ బిల్లు ముట్టుకుంటే షాక్ : పిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

కరెంటు తీగ పట్టుకుంటే షాక్ కొట్టడం సహజం, బాదుడు రెడ్డి జగన్ పాలనలో బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొడుతుందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని, తగ్గిస్తామని జగన్ చెప్పారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బాదుడే బాదుడుగా ఛార్జీలను పెంచేస్తున్నారని వాపోయారు. నాలుగేళ్లల్లో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలుపెంచారని పేర్కొన్నారు. అదనపు భారం రూ.17,723 కోట్లు, ఇది చాలదన్నట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో 2023-24 సంవత్సరంలో రూ.11,270 కోట్లు అదనపు భారం పడనుందని చెప్పారు. గృహాలకు స్మార్ట్ మీటర్ పేర్లతో రూ.13000 కోట్లు అదనపు భారం పడనుందని తెలిపారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.6,888 కోట్లు అదనపు భారం పడుతుందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలతో పాటు కస్టమర్, స్థిర, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపిందని చెప్పారు. ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న దాటినాక బోడి మల్లన్న అన్నట్లుంది జగన్ వైఖరి కరెంట్ ఛార్జీలు తగ్గించకపోతే ప్రజలు వైసిపికి షాక్ ఇస్తారని, ఫ్యాన్ ను తిరగకుండా చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో రాయచోటి కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్త షేక్ అల్లాబాకష్, పిసిసి డెలిగేట్ ఎస్ఎండి గౌస్ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, చెన్నక్రిష్ణ, ఖదీర్, ఖాదర్ ఖాన్, ఖాదరవల్లి, దినకర్, మంజునాథ, నరేష్, మైసూరారెడ్డి, వై.వి రమణమ్మ, లతా మహబూబ్ బీ, ఇమం తుల్లా ఖాన్, సయ్యద్ ఉబర్తుల్లా షరీఫ్, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, సుబ్బారాయుడు, మహబూబ్ బాషా, వినయ్ పాల్గొన్నారు.

31 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్న ముక్కపల్లె సమీపంలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 31 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, కెవిపల్లె, యర్రావారిపాలెం, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అర్హులైన 31 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మి,ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లోకేష్‌కు సంఘీభావంగా పాదయాత్ర : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర మంగళవారం నాటికి 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంటున్న సంద ర్భంగా ఆయనకు సంఘీభావంగా మూడు కిలోమీటర్లు పాద యాత్ర నిర్వహి స్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు కిలోమీటర్లు పాదయాత్ర ఉదయం 10 :30 గంటలకు గుట్టపల్లి వద్ద నుండి బయలుదేరుతుందని చెప్పారు మధ్యాహ్నం మూడు గంటలకు శిబ్యాల వద్ద ఉన్న టిడ్కో గృహాల సందర్శన అనంతరం చలంపల్లె రింగ్ రోడ్డు వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, రాష్ట్ర నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మండల రూరల్ అధ్యక్షులు మురికి నాటి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

చైతన్య రథయాత్రను విజయంతం చేయాలి.. రాష్ట్రంలో భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ చైతన్య రథయాత్రను విజయవంతం చేయాలని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా లోకేష్ సంఘీభావంగా మూడు కిలోమీటర్లు పాదయాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కడప జట్టుపై అనంతపురం విజయం

- సెంచరీలు చేసిన ప్రశాంత్, జయంత్ కృష్ణ

కడప: అనంతపురానికి చెందిన ప్రశాంత్, జయంత్ కృష్ణ సెంచరీలు చేయడంతో 408 పరుగుల తేడాతో అనంతపురం జట్టు కడప జట్టు పై ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అనంతపురం మొదటి ఇన్నింగ్స్ లో 397 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్ లో 148 పరుగులు చేసింది. 3 వికెట్ల నష్టానికి 320 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు తన రెండవ ఇన్నింగ్స్ లో 81.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 407 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ చెట్టులోని ఏ. జయంత్ కృష్ణ 119 పరుగులు (సెంచరీ), ప్రశాంత్ 141 (సెంచరీ) పరుగులు చేశారు. కడప జట్టులోని సాయి అర్జిత్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 71.0 ఓవర్లలో 248 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. ఆ జట్టులోని విజయ్ రామ్ రెడ్డి 90, సాయి అర్జిత్ రెడ్డి 91 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ఎం.కే. లోహిత్ సాయి కిషోర్ బౌలింగ్లో అద్భుతంగా రాణించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ప్రదీప్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు.

డ్రాగా ముగిసిన చిత్తూరు, కర్నూలు మ్యాచ్ : వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్ లో కర్నూలు జట్టు 284 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. చివరి రోజు కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 78.0 ఓవర్లలో 9 వికెట్లను నష్టానికి 361 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కర్నూలు జట్టులోని ఎం నయూముల్లా 134, సాయి సూర్య తేజ రెడ్డి 47 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మొహమ్మద్ ఇర్ఫాన్ 3 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టుపై ఆధిక్యత సాధించింది.

మునిగోపాలకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

సీనియర్ సిటిజన్ల సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్ల సంక్షేమమే ధ్యేయమని ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ పాఠశాలలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో రాష్ట్ర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంలో ఇచ్చిన పదవి బాధ్యతలు పెంచిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోసం సమర్థవంతంగా సేవలు అందిస్తానన్నారు. వై.ఎస్.మునిరత్నమయ్య, ప్రొఫసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫసర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ మునిగోపాలకృష్ణ అందిస్తున్న సేవలను కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు, రాష్ట్ర కోశాధికారిగా మదన్మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్.మునిగోపాల కృష్ణ ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇన్‌ఛార్జి కార్యదర్శి వి.ఎం.నాగరాజు నివేదిక చదివి వినిపించారు. కోశాధికారి ఉస్మాన్ సాబ్ జమ, ఖర్చులు చదివి వినిపించి సభ్యుల ఆమోదం పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జగన్మోహన్, శకుంతలమ్మ, కృష్ణకుమార్, రామచంద్రయ్య, ఉస్మాన్, ధనలక్ష్మి, కృష్ణమూర్తి, జగన్మోహన్, టిఎస్ఎ కృష్ణమూర్తితోపాటు సీనియర్ సిటీజన్లు పాల్గొన్నారు. అనంతరం మునిగోపాలకృష్ణను అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

చైతన్య రథయాత్రతో టిడిపి శ్రేణుల్లో జోష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో తలపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రతో టిడిపి శ్రేణుల్లో సరికొత్త జోష్‌ను నింపుతోంది. ఆదివారం మదనపల్లి నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర కొనసాగింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి గంట నరహరి, మదనపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీ రామ్ చినబాబు, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, నాయకులు యశస్విరాజ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శివ,రామసముద్రం మండలం అధ్యక్షులు విజయ్ గౌడ్, మాజీ అధ్యక్షులు కృష్ణంరాజు యాదవ్, నాయకులు రాటకొండ మధుబాబు, మదనపల్లి పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పాల్గొన్నారు.

చైతన్య రథయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

పీలేరును హరితవనంలా తీర్చిదిద్దుదాం :'చింతల'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

కాంక్రీట్ అరణ్యంలా మారుతూన్న పీలేరు పట్టణాన్ని హరితవనంలా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ కలసి రావాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరు పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల ముందున్న పీలేరు స్థితికి, ప్రస్తుతమున్న పరిస్థితికి ఎంతో వ్యత్యాసం ఉందని అభిప్రాయపడ్డారు. పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతూన్న కాలుష్యాన్ని అధికంగా మొక్కలు నాటి నివారణ చర్యలు పాటిద్దామని అన్నారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడ్డానికి చెట్లు ఎంతో ఉపకరిస్తాయని గుర్తించే సర్పంచ్ హబీబ్ బాష ప్రతి ఇంటికి ఓ చెట్టు ఉండాలన్న లక్ష్యంతో వివిధ రకాల పండ్లు, పూలు, నీడనిచ్చే 15,009 మొక్కలను అందిస్తున్నారని చెప్పారు. మనం పీలేరు ఓ హరితవనంలో భవిష్యత్ తరాలకు అందివ్వాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. పట్టణాన్ని కాలుష్య రహితంగా అభివృద్ధి చేస్తూ ఇతరులకు ఆదర్శవంతులుగా స్థానిక ప్రజలు ఉండాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఓవైపు జనాభా పెరుగుతుంటే, మరోవైపు చెట్లు తరిగిపోతున్నాయన్నారు. ఫలితంగా పెరుగుతూన్న జనాభాకు తగినంత ప్రాణవాయువు లభించే పరిస్థితులు రాను రాను మృగ్యమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాబట్టి మన భావితరాల్లో జన, జీవరాసుల జీవం కోసం తగినంత ఆక్సిజన్ అందాలంటే ఇప్పుడు మనం మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలోని సిబ్బందికి మొక్కలు పంచి పెడుతూ వాటిని పెంచే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 3580 దానిమ్మ, 4351 జామ, 3160 అల్లనేరేడు, 1875 బాదం, 741 పచ్చ తురాయి, 694 ఎర్రతురాయి, 608 కుక్క నేరేడు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, జడ్పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు నెల్లూరి వెంకటాచలపతి, హరితా వెంకటరమణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజు అమ్మ, డిసిసిబి డైరెక్టర్ స్టాంపుల మస్తాన్ సాహెబ్, వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, రాయలసీమ జోన్ వైసిపి మహిళా ప్రధాన కార్యదర్శి మహితా ఆనంద్, ఎఎంసి చైర్మన్ చంద్రగిరి ఎల్లయ్య, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి బాష, వార్డు సభ్యులు, ఎంపిటిసిలు, పంచాయితీ ఇఒ రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట జడ్‌పిహైస్కూల్లో ఆదివారం 1987-88 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎంతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 సంవత్సరాల తర్వాత అందరు ఒకే చోట కలవడం సంతోషంగా ఉందన్నారు. చదువులో పోటీ పడుతూనే స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. మళ్లీ పాఠశా లలోకి ఇలా కలవడంతో ఎంతో అనుభూతిని ఇచ్చిందన్నారు. చదువుకొని వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలలో స్థిరపడినట్లు చెప్పుకున్నారు.తమకు చదువు చెప్పిన గురువులైన కనకసభాపతి, సులోచనకుమారి, చంద్రశేఖర్, రామకృష్ణమ రాజు లను సన్మానించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగరపంచాయతీలో సోమవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి హాజరవుతున్నట్లు పలమనేరు నియోజకవర్గం పరిశీలకులు ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. కార్య క్రమానికి నగర పంచాయతీ సంబంధించిన ఐదు సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, రూరల్ మండలానికి సంబ ంధించిన సర్పంచులు, ఎంపిటిసీలు, జడ్‌పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపి, అన్ని గ్రామాల జెసిఎస్ కన్వీనర్లు అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వ విప్ రాక..

పుల్లంపేట : మండల పరిధిలోని పుల్లంపేటలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరవుతున్నట్లు స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొనాలని కోరారు.

ఘనంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి- బి.కొత్తకోట

పట్టణంలోని కట్టమీద గంగమ్మ జాతరను ఆదివారం బోయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోయవీధి ప్రజలు అమ్మవారికి బోనం సమర్పించేందుకు ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకొని బోనాలు సమర్పించారు. ఆలయ పూజారి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తారని చెప్పారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి బోనం సమర్పించి అమ్మవారి కృప కటాక్షాలు పొందుతారని అన్నారు. కార్యక్రమంలో బోయ సంఘం నాయకులు ఆదినారాయణ, మంజు, రాజా, వెంకటేష్, రాజేంద్ర బాబు, అంజి, లక్ష్మణ పాల్గొన్నారు.

డిహెచ్‌పిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ములకలచెరువు: మండల దళిత హక్కుల పోరాటసమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు ఆ సమితి అధ్యక్షులు, కార్యదర్శి ఎం.హరి, సుధీర్ కుమార్ తెలిపారు. మండల కన్వీనర్ సోమశేఖర్, కార్యదర్శి గంగాధర్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. దళిత హక్కుల పోరాటానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా దేశాయ్‌తిప్పారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి సీనియర్ నాయకులు ఎర్రప్ప, గడ్డం నరసింహారెడ్డి, మహమ్మద్ ఖాసిం, ఈశ్వర, రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచులు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, స్థానిక ఆర్‌ఎంపి వైద్యశాల లోని రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ప్రజా ఆదరణ కలిగిన వ్యక్తని, నేటికీ ఆయనను ప్రజలు ఆరాధిస్తున్నారని అన్నారు. అటు వైద్యరంగంలోను, ఇటు ప్రజాసేవలోను ఆయన ఎప్పుడు ముందుంటారని అన్నారు. రోజురోజుకు ఆయనను అభిమానించేవారు, ఆదరించేవారు పెరుగుతున్నట్లు తెలిపారు. ఆయన మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు యర్రప్ప, గడ్డం నరసింహారెడ్డి, మహమ్మద్ ఖాసిం, ఈశ్వర, రామారావు, నవాజ్ హుస్సేన్, నాగరాజా, వెంకటరమణ పాల్గొన్నారు.

త్వరలో మెగా డిఎస్‌సి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-పుల్లంపేట

త్వరలో మెగా డిఎస్‌సి విడుదల చేయ డానికి ప్రభుత్వం సన్నా హాలు చేస్తోందని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయులు నరసిం హారెడ్డి ఎమ్మెల్సీని కలి శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 1998 డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థు లందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సిఎం జగన్‌ను కలిసిన మాజీ ఎంపిపి

సుండుపల్లె మాజీ ఎంపిపి అజంతమ్మ ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మో హన్‌రెడ్డిని కలిశారు. తనకు రాష్ట్ర టూరిజం డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సమ స్యలను సిఎంకు దృష్టికి తీసుక వచ్చి నట్లు తెలిపారు. వరదల కారణంగా తెగిపోయిన పింఛా, అన్న మయ్య ప్రాజెక్టును నిర్మా ణాల ను చేపట్టి రైతాంగాన్ని ఆదుకో వాలని కోరి నట్లు తెలిపారు. పింఛా ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

సిఎం జగన్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి

ఆరోగ్యాన్నిచ్చే డ్రాగన్ ఫ్రూట్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇటీవల కాలంలో డ్రాగన్ ఫ్రూట్ పేరు బాగా వినిపిస్తున్నట్లు చెప్పవచ్చు. దీనిలో పోషక విలువలున్నాయని చాలా మంది తినేందుకు డ్రాగన్ ఫ్రూట్స్‌ను ఇష్టపడుతున్నారు. ఈ పండు ఒకప్పుడు నగర ప్రాంతాల పెద్దపెద్ద మాల్స్‌లో మాత్రమే దొరికేది. కానీ ప్రస్తుతం పట్టణాల్లో కూడా ఇవి అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా మరీ ముఖ్యంగా పులివెందుల మండల పరిధిలోని ఈ.కొత్తపల్లి గ్రామంలో పుష్పనాథ్‌రెడ్డి అనే రైతు మూడు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్‌ను సాగు చేశారు. ఇక్కడ వచ్చిన దిగుబడిని రైతు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఫ్రూట్ ఎరుపు, పింక్ రంగులో ఉంటుంది. దీని రుచి తాటి ముంజలా ఉంటుందని పలువురు అంటున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌తో ఐస్ క్రీం, కేకులు, జెల్లీలు, సాలాడ్స్ తయారు చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌ను పలు పేర్లతో పిలుస్తుంటారు. ఈ ఫ్రూట్‌లో శరీరానికి శక్తినిచ్చే ఫైబర్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయని పలువురు చెబుతున్నారు. మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్ మెండుగా ఉంటాయి. విటమిన్ 'సి' అధికంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో బి1, బి2, బి3 విటమిన్లూ ఉంటాయి. తరచూ మన డైట్‌లో డ్రాగన్ ఫ్రూట్ చేర్చుకుంటే అనేక ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పండు తినడం వల్ల చక్కెర వ్యాధి అదుపులో ఉంటుందని అంటున్నారు. ఎన్‌సిబిఐ ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటితోపాటు

ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్, ఫైబర్ మెండుగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతాయి. ఈ పండు ఇన్సులిన్ రెస్టిసెన్స్‌ను పెంచుతుంది. డయాబెటిస్ లేనివారు, డ్రాగన్ ఫ్రూట్ తింటే షుగర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

గుండెకు మేలు..

మనం తరచుగా డ్రాగన్ ఫ్రూట్ తింటే గుండె ఆరోగ్యానికి మేలు. డ్రాగన్ ఫ్రూట్ గుండెను సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్ విత్తనాల్లో ఒమేగా-3, ఒమేగా-9 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. హెచ్‌డీఎల్ గుండె ఆరోగ్యానికి మంచిది.

క్యాన్సర్ రోగులకు చాలా మంచిది..

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటి ట్యూమర్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి మహిళలను రొమ్ము క్యాన్సర్ నుంచి రక్షిస్తాయి. క్యాన్సర్ రోగులకు డ్రాగన్ ఫ్రూట్ తింటే, వారికి కొంత ఉపశమనం కలిగిస్తుంది.

కొలెస్ట్రాల్ కంట్రోల్ అదుపులో..

డ్రాగన్ ఫ్రూట్ తింటే కొలెస్ట్రాల్ ట్రైగ్లిజరైడ్, చెడు కొలెస్ట్రాల్, లిపోప్రొటీన్ కొలెస్ట్రాల్ తగ్గుతాయి. ఇవి మన శరీరంలో ఎక్కువగా ఉంటే గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ దీని గింజల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి.

ఆర్థరైటిస్ వారికీ మంచిదే..

ఆర్థరైటిస్ నొప్పి ఇన్ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడం వల్ల దీన్ని తింటే ఆర్థరైటిస్ నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఇమ్యూనిటీ పెరుగుతుంది..

డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే విటమిన్ సి, కెరోటినాయిడ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా తెల్ల రక్తకణాలు తినవు. డ్రాగన్ ఫ్రూట్ తింటే ఇన్ఫెక్షన్లు రావు. మెదడుకు కూడా మంచిది. ఆక్సీకరణ ఒత్తిడితో శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో అల్జీమర్స్, పార్కిన్సన్స్, మూర్ఛ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు మెదడు పని తీరు సరిగ్గా లేకపోతే వస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ తింటే మెదడు పనితీరు మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పండించేందుకు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది.

కువైట్‌లో వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - కడప

మహానేత కీ.శే. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి 74 వ జయంతి వేడుకలు కువైట్ మాలియా ప్రాంతంలో పవన్ ఆంధ్ర రెస్టారెంట్‌లో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలిరెడ్డి, కమిటీ సభ్యులు వై.యస్ ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించినారు. ఈ సందర్భంగా బాలి రెడ్డి మాట్లాడుతూ అపర భగీరథుడు రాజన్న తన పరిపాలనలో పేద బడుగు బాలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కో - కన్వీనర్ గోవింద నాగరాజు వైసిపి కువైట్ కో -కన్వీనర్ యం.వి నరసారెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, మన్నూరు చంద్ర శేఖర్ రెడ్డి, బిసి విభాగం ఇన్‌ఛార్జి రమణ యాదవ్, యువజన విభాగం ఇన్చార్జ్ మర్రి కల్యాణ్, సలహాదారులునాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అబ్ తురబ్, అన్నాజీ శేఖర్, ఎస్సీ, ఎస్టీ భాగం ఇన్‌ఛార్జి బి.ఎన్. సింహ, మైనారిటీ నాయకులు, షేక్ రహంతుల్లా, షా హుస్సేన్, మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు, వైఎస్ లాజరస్, సుబ్బా రెడ్డి, యువజన విభాగం సభ్యులు సయ్యద్ సజ్జాద్, షేక్ సబ్దర్, జగనన్న యూత్ ఫోర్స్ అధ్యక్షులు లక్ష్మి ప్రసాద్, యన్.వి సుబ్బారెడ్డి ,జగనన్న సైన్యం అధ్యక్షులు బాషా, అరవ

వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బాలిరెడ్డి, నాయకులు

దుబాయ్‌లో.. వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలు యుఎఇ దేశంలోని దుబాయ్ నగరంలోని అల్ కరమా జబీల్ పార్కులో వైసిపి దుబాయ్ కన్వీనర్ సయ్యద్ అక్రం బాషా, జిసిసి యుఎఇ అడ్వయిజర్ పసన్న సోమిరెడ్డి, యుఎఇ వైసిపి వింగ్స్ గ్రూపు సభ్యులు, యుఎఇ ఎపిఎన్ఆర్‌టిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహి ంచారు. సయ్యద్ అక్రంబాషా, ప్రసన్న సోమిరెడ్డి చేతుల మీదుగా వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి, భారీ కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి యుఎఇ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ఎపి ఎన్ఆర్‌టిఎస్ సభ్యులు, మహిళలు , అభిమానులు పాల్గొన్నారు.

ముల్ల పొదల్లో నిండివున్న ప్రధాన రహదారి

మలుపు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

- పట్టని ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

నర్సాపురం-బసనపల్లె ప్రధాన రహదారిలో కంప చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో మలుపు వద్ద రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఏ క్షణమైనా ప్రమాదాలు చోటు చేసుకోవచ్చని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఆ దారిలో మండల కేంద్రమైన నరసాపురానికి దాదాపు 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే కంపు చెట్లు అడ్డంగా రావడంతో అనేక రకమైన ప్రమాదాలు చోటు చేసుకున్నారు. ఎన్ని జరిగినా ఆర్అండ్‌బి అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం. అసలు మండలంలో ఆర్అండ్‌బి అధికారులు ఉన్నారా లేరా అని అనుమానం ప్రజలకు కల్గుతోంది. ఇటీవల నిర్వహించిన మండల సమావేశంలో ఫిర్యాదు చేయాలని కొంత మంది వచ్చినా ఆ శాఖ అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజలు ఏమీ చేయలేక వెనుదిరిగి వెళ్లారు. ఏ ఒక్క జిల్లాస్థాయి అధికారులు కానీ పట్టించుకోకపోవడం బాధాకరమని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నరసాపురంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి ఊరి బయట వరకు గ్రామంలో రోడ్డు అధ్వానంగా ఉన్నా ఏ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షం వస్తే ఊర్లో మోకాళ్ళ లోతుకు నీళ్లు నిలబడి రోడ్లు అస్తవ్యస్తంగా మారుతుందని చెప్పారు. డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు ఇళ్లలోకి వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు సదాశివరెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా గోటూరి సురేంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా సుబ్రమణ్యం (బుజ్జి), కోశాధికారిగా చప్పిడి జయ చంద్ర నాయుడు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పి.మహేష్‌గుప్త, డాక్టర్‌ప్రసాద్, శశిధర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలాజీ, మోహన్‌రెడ్డి, పి.రవి, కిశోర్, శీలావతి, నరసింహులుశెట్టి, సుధాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వస్త్ర, మాల్స్ దుకాణాల కార్మికులకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని వస్త్ర, కిరాణా, ఫ్యాన్సీ దుకా ణాల్లో, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే కార్మికులకు జీతా లను పెంచాలని సిఐ టియు నాయకులు దాసరి విజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జమ్మలమడుగు పట్టణంలోని పలు దుకాణాల్లో 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికుడికి రూ.7000 నుంచి రూ.8000 జీతం ఇచ్చి సరిపెడుతున్నారన్నారు. అన్నారు. సుప్రీం కోర్టు ఆర్డర్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అంతేకాక వారిపై పని భారం తగ్గించి షాప్‌లలో పనిచేస్తున్న కార్మికులందరినీ గుర్తించి కనీసం రోజుకు రూ.500-రూ.600 ప్రకారం నెలవారి జీతంగా రూ.18,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, సిఐటియు ఆటో కార్మికులు స్వామి, రవి, రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు : పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని అటవీ రేంజ్ అధికారి హేమాంజలి సూచించారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరా న్‌మెంట్ కార్యక్రమం ఆదివారం స్థానిక కార్యా లయంలో నిర్వహించారు. జెవివి అధ్యక్షులు శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె మాట్లా డుతూ రోజు రోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని ప్రజలు తమ వంతు బాధ్యతగా తగ్గించాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో తమతోపాటు క్యారీ బ్యాగ్‌ను తీసుకెళ్లాలని ప్లాస్టిక్ బ్యాగల వాడకాన్ని తగ్గించాలన్నారు. బయట దొరికే వాటర్ బాటల్స్‌ను కాకుండ తమతో నీళ్లబాటిల్‌ను తీసుకెళ్లాలన్నారు. పర్యావరణదినోత్సవం సందర్భంగా రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న జెవివి సమ్మర్ క్యాంపు విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేశారు. జెవివి కార్యదర్శి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి శాస్త్రీయ ఆలోచన, శాస్త్రీయ దృక్పథం పెంచుకో వాల న్నారు. ప్రతి అంశాన్ని హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. కార్య కమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా కార్యదర్శి ఉషారాణి, జెవివి నాయకులు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, సునీత పాల్గొన్నారు.

నూతన కమిటీ చిత్తశుద్ధితో పనిచేయాలి

జమ్మలమడుగు రూరల్ : పివి రావు మాల మహానాడు నూతన కమిటీ చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనం శివయ్య కోరారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగారి ప్రభుదాస్, రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల నాగరాజు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా బోనం శివయ్య మాట్లా డుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి నాయ కుడు పని చేయాలన్నారు. మాలల ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీలో జిల్లా అధ్యక్షులుగా కుందవరం పుష్పరాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా బిద్రు దాని యేలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అతిథిగా రాష్ట్ర దళిత సలహా దారులు మేకల ఆంజనే యులు ప్రసంగించారు. కమిటీ ఎంపిక అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జోహార్లు అంటూ నినా దాలు చేశారు. కార్యక్రమంలో కమటం సంజయ్, కెసి పుష్పరాజు, బరిగెల రాజు, రామకృష్ణ, మేసా శివ, బరిగెల చంద్ర, సతీష్, జేస్తాది చంటి, పట్నం ప్రశాంత్ పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేత లిఖితేశ్వరరావు

ప్రజాశక్తి- కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని హాల్ ఆఫ్ చెస్ లో నిర్వహించిన అశ్రఫ్ ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ లో విజేతగా రేటెడ్ క్రీడాకారుడు లిఖితేశ్వరరావు నిలిచాడు. ద్వితీయ స్థానంలో రేటెడ్ క్రీడాకారుడు జాఫర్ నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో 34 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్లకు గాను 4.5 పాయిం ట్లు సాధించిన లికితేశ్వరరావు టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. 4.5 పాయింట్లు సాధించిన జాఫర్ టైం బ్రేక్ స్కోరులో లిఖిత్ కంటే తక్కువ ఉండడంతో రెండవ స్థానం సాధించాడు. విజేతలకు బహుమతులను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి, కోచ్ తపస్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి గ్రామదేవత శ్రీ ఎల్లమ్మ అమ్మవారి జాతర అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం జాగరణ అమ్మవారి కథా కాలక్షేపంతో భక్తులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో స్మరించుకున్నారు. ఆదివారం అమ్మవారి ఊరేగింపు, సిద్ధ పూజ మధ్యాహ్నం బోనాలు సమర్పించి మొక్కుబడి ఉన్న భక్తులు రాత్రి చాందిని బండ్లను కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. సోమవారం ఉదయం నుండి అమ్మవారి సర్వదర్శనం, రాత్రి లంకా దహనం, పుష్ప పలికి కార్యక్రమాలు అత్యంత వైభవ వేతంగా నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం ఫార్వేట్ ఉత్సవము, కల్లిపాటు తో అమ్మవారి జాతరను వైభవంగా ముగిస్తారు. కార్యక్రమంలో జిల్లా నుంచి అన్ని ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అవ్వాలని ఆలయ ధర్మకర్త అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఓబులేసును సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులుగా ఓబులేసు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు తాలూకా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులుగా ఓబులేసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, కోశాధికారి ఎన్నికల పరిశీలకులు నిత్యపూజయ్య పర్యవేక్షణలో కోడూరు తాలూకా అధ్యక్షునిగా ఓబులేసులు, కో-ఆప్షన్ ద్వారా నియమించుటకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యదర్శిగా రవీంద్రవర్మ ను నియమించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి జిల్లా, రాష్ట్ర నాయకత్వంతో కలిసిఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి అస్లాం, అసోసియేట్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షులు గౌరీ శంకర్, ఉషారాణి, సతీష్ రెడ్డి, అనసూయ, రాజేశ్వరి పాల్గొన్నారు.

డాక్టరేట్‌ను అందుకుంటున్న వేంపల్లి అబ్దుల్‌ఖాదర్

అబ్దుల్ ఖాదర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-కలికిరి

కళారత్న వేంపల్లి అబ్దుల్‌ఖాదర్‌ను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టర్ రేట్‌కు ఎంపిక చేసింది. విద్య కళా సాహిత్య సాంస్కృతిక సేవా రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచిన ఆయనకు యూనివర్సిటీ సెనేట్ బోర్డ్ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ మానేయిల్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్ ప్రకటించారు. సోషియల్ లీడర్స్ అండ్ రెస్పాన్సిబులిటీస్ నిర్వహించిన ఇంట ర్నేషనల్ సెమినార్‌లో ప్రతిభ కనపరిచినందుకు ఈ అరుదైన గౌరవం దక్కిందని పండితులు, భాషాభిమానులు అబ్దుల్ ఖాదర్‌ను అభినం దించారు. కలికిరి పట్టణానికి చెందిన వేంపల్లి తెలుగు పండితుడు గాను, ఎస్‌వి యూనివర్సిటీ పాలకమండలి సభ్యులుగాను, రచయితగా ఎన్నో సేవలు అందించారు. తెలుగు తేట ఎడిటర్ వి.సికిందర్, టీఎం వ్యాలీ డైరెక్టర్ కెవై కృష్ణయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి పోస్టును తిరిగి సాధించారు

ప్రజాశక్తి-పీలేరు

జిఒ 117 నిబంధనల ప్రకారం మండలంలోని వేపులబైలు పంచాయతీ, జంగంపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ బృందం గ్రామస్తుల సహకారంతో బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచుకుని హెచ్‌ఎం పోస్టు రద్దు కాకుండా జాగ్రత్త పడ్డామని ఆదివారం ఆ పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి గంగాధర్ చెప్పారు. పాఠశాలల విలీనం ఫలితంగా జిఒ 117 నిబంధనలను అనుసరించి 94 మందికి తక్కువ సంఖ్య విద్యార్థులు ఉండే ప్రాథమిక పాఠశాలలు, 138కి తక్కువ మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ నిబంధనల ప్రకారం మండలంలోని జంగంపల్లి ఉన్నత పాఠశాలతో పాటు రేగళ్ల, శివరామపురం జడ్‌పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు రద్దయ్యాయి. దీంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందాలు సకాలంలో స్పందించి, గ్రామస్తుల సహకారంతో కొత్తగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకుని ఆ పోస్టులు రద్దు కాకుండా తిరిగి నిలబెట్టుకున్నారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు 'మల్లికార్జునుడు'

మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

కవిగా, రచయితగా, నటుడుగా, నాటక కర్తగా, దర్శకుడుగా, నాటక ప్రయోక్తగా, ఉత్తమ ఆచార్యులుగా బహు ముఖీన సేవలందించిన ప్రజావంతుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అని మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. లలిత కళానికేతన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అభినందన సంచిక 'మల్లికార్జునీయం' పుస్తకావిష్కరణ సభను నిర్వ హించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మైదుకూరు శాసనసభ్యులు వేదికపై ఉన్న అతిథులతో కలసి ముందుగా 'మల్లికార్జునీయం' పుస్తకాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి సాహితీవేత్తగా, ఉత్తమ ఆచార్యులుగా సేవలందించి మైదుకూరు నియో జకవర్గానికి గర్వకారణమయ్యారన్నారు. వ్యక్తిగా ఎంతోమందికి సన్నిహితంగా మెలగుతూ జిల్లాలోనే సాంస్కృతిక సారథిగా కొనసాగుతున్నారన్నారు. బ్రౌన్ గ్రంథాలయానికి పాఠకుడుగా తన ప్రస్థానాన్ని కొనసాగించిన మల్లికార్జున రెడ్డి సాహితీవేత్తల సాంగత్యంతో రచయితగా ఎదిగి తిరిగి అదే గ్రంథా లయానికి సంచాలకులుగా సేవలందించడం, గ్రంథాలయ ప్రగతికి కృషి చేయడం హర్షణీ యమన్నారు. ఆత్మీయ అతిథి, కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి తమ సంస్థ తరపున ఏ కార్యక్రమం నిర్వహించినా కార్యక్రమ రూపకల్పనతోపాటు నిర్వహణ బాధ్య తలను కూడా చేపట్టేవారని, బ్రౌన్ గ్రంథా లయంలో జరిగే సాహిత్య కార్యక్రమాలకు తనకు తప్పక ఆహ్వానం అందించేవారన్నారు. మల్లికార్జున రెడ్డి బాధ్యులుగా ఉన్నప్పుడు తన వద్ద ఉన్న అనేక పుస్త కాలను గ్రంథాలయానికి బహూ కరించానన్నారు. పుస్తక సమీక్షకులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లా డుతూ మల్లికార్జున రెడ్డి జీవితం తెరచిన పుస్తకమని, ఆయన జీవిత ప్రస్థానం ఎంతోమందికి ఆదర్శ ప్రాయమన్నారు. ఆ తర్వాత వేదికపై ఉన్న అతిథు లను, మల్లికార్జునీయం పుస్తక సంపాదకవర్గ మిత్రు లను, పుస్తక ముద్రణకు ఆర్థికంగా సహక రించినవారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య మల్లి కార్జున రెడ్డిని మిత్రులు, బంధువులు, ఆత్మీయులు ఘనంగా సత్కరించారు. ఆకాశవాణి క్యాజువల్ అనౌన్సర్ భూమిరెడ్డి స్వరూ పరాణి సభా నిర్వహణ చేశారు. నిర్వాహకులుగా మూల ఈశ్వరరెడ్డి, మూల శివప్రసాద్ రెడ్డి, మూల దేవ మునిరెడ్డి వ్యవహరించారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోటావూరు పంచాయతీ, ఈడిగపల్లి రామపురానికి చెందిన రమణ(46) ఆదివారం ఇంటి నుంచి పొలం వద్దకు నడుచుకొని వెళుతుండగా బి.కొత్తకోట నుంచి మదనపల్లి వస్తున్న ద్విచక్ర వాహనం రమణను వేగంగా ఢీకొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండుగా మార్గమధ్యంలో రమణ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన రమణ